# వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

# పీవీ ఇప్పుడు యాదికొచ్చిండా?



డాక్టర్ వి.వి.రామారావు
98492 37663

'అన్నం పెట్టిన వారి నోట్లోనే సున్నం గొట్టే బాపతు'.. అనే సామెత ఎందుకు పుట్టిందో, ఏ సందర్భంలో పుట్టిందో కానీ పీవీ నరసింహారావు విషయంలో కాంగ్రెస్ అధిష్ఠానం అనుసరించిన వైఖరిని పరిశీలించినప్పుడు మాత్రం ఇది సరిగ్గా సరిపోతుందనేది నూటికి నూరు పాళ్లు సత్యం. పీవీకి కాంగ్రెస్ చేసిన ద్రోహం చూశాకే ఈ సామెత పుట్టిందా? అనిపిస్తుంది.

పీవీ నరసింహారావు రాజకీయ ప్రస్థానం గమనిస్తే ఆయన ఎమ్మెల్యేగా ఎన్నికైంది మొదలు, సీఎం పదవైనా, చివరికి ప్రధాని పదవైనా కోరుకోకుండా వచ్చినవే కానీ, తనకు తానుగా ప్రయత్నం చేసి పొందినవి కావు. అలాంటి నిష్కపటి, నిర్మలచిత్తుడు ప్రధాని కాగానే ఆర్థిక సంస్కరణలు మొదలు పలు కీలకరంగాల్లో అద్భుతమైన అభివృద్ధిని చేసి దేశాన్ని ప్రగతిపథంలో నడిపారు. దార్శనికతను కలిగిన మేధావిగా, నవ భారత నిర్మాణ సారథిగా ప్రపంచ అగ్ర రాజ్యాధిపతుల ప్రశంసలందుకున్నారు.

పీవీకి వచ్చిన పేరు ప్రఖ్యాతులు చూడగానే, వినగానే, సోనియమ్మ కడుపులో కార్చిచ్చు ఏర్పడింది. మన్మోహన్‌సింగ్ ఎంత ఓదార్చినా లాభం లేకపోయింది. మరోవైపు అర్జున్‌సింగ్, తివారి, తదితర చతుష్టయం ఆమె చెవిలో ఇల్లు కట్టి కందిరీగల వలె ఝుమ్మని వికృతరాగాలు తీయడంతో పీవీ పట్ల అయిష్టత కలిగి అభద్రతా భావన ఏర్పడింది. మనమే గద్దె ఎక్కించాం.. కాబట్టి ఒక్క టర్మ్ ఎలాగో భరిద్దామని సాలోచనగా అన్నది.

1997-99లో ఎప్పట్లాగే ఎన్డీయే తగవులతో కాలక్షేపం చేసి 1977-79 కాలం నాటి జనతా పార్టీ వైఫల్య చరిత్రను పునర్ లిఖించినప్పుడు, సోనియమ్మకు సువర్ణావకాశం దొరికి ప్రజల మధ్యకు వచ్చింది. బాబ్రీ మసీద్ విధ్వంసం మొదలు రకరకాల కేసులతో సతమతవుతున్న పీవీకి అండదండలందించే బదులు ఆయనను కాంగ్రెస్ కార్యాలయం వరకు కన్నెత్తకుండా చేయడంలో తొలి ఎత్తుగడ ఫలించింది. 1999లో ఎన్డీయే ప్రభుత్వంపై నెగెటివ్ ఓటింగే కాంగ్రెస్‌ను ప్రభుత్వం ఏర్పాటుచేయించింది. ప్రధానిగా సింహాసనం అధిష్ఠించే పట్టాభిషేక సమయానికి బీజేపీ ఆమె విదేశీయతను ప్రశ్నించి ఆమె తప్ప ఎవరైనా మాకు ఓకే అనడంతో మన్మోహన్‌సింగ్ ప్రధాని కావలసి వచ్చింది. అయితేనేం ఆయన ఉత్సవ విగ్రహం మాత్రమే. సోనియా గాంధీనే సమస్తం.

గతంలో దేవకాంత్ బారువా అనే ఓ భట్రాజు నేత 'ఇందిరానే ఇండియా-ఇండియాయే ఇందిర' అని నినాదం ఇచ్చినట్టు కాంగీయులు అంగీలు చింపుకొని సోనియానే సమస్తమని సహస్ర నామార్చన చేయడం మొదలుపెట్టారు. ఉమ్మడి ఏపీ కాంగీయులకైతే పట్ట పగ్గాల్లేవు. వైఎస్ఆర్, హన్మంతరావు.. ఒకరా, ఇద్దరా ఇలా ఎంతోమంది నాయకులు ఢిల్లీలోనే మకాం వేయడం షోడశోపచారాలతో పూజించడం నిత్యకృత్యమైంది. ప్రధాని కాలేకపోయానని సోనియా లోలోన వలవల ఏడ్చింది. ఇదంతా పీవీ కుట్ర అని ఆమె అపోహ. ఎలాగంటే పీవీ తన కవి మిత్రుడైన వాజపేయిని బ్రెయిన్ వాష్‌చేసి ఉంటాడని ఆమెకు అనుమానం. దాన్ని భజనపరులు చిలవలు పలవలు చేయడంతో తోక తొక్కిన తాచులా బుసలు కొట్టసాగింది. మరోవైపు పీవీ తన కేసులు తానే వాదించుకొని నిర్దోషిగా బయటపడ్డారు. కానీ, అనారోగ్యం పాలై 2004 డిసెంబర్ 23న మృత్యుఒడిలోకి జారుకున్నారు.

కేంద్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం సోనియాగాంధీ ఆదేశాలతో మొక్కుబడిగా దండం పెట్టుకొని, దహన సంస్కారాలకు దూరంగా ఉండిపోయింది. దేశ చరిత్రలో ఒక మాజీ ప్రధానికి ఇంత ఘోర అవమానం ఎన్నడూ జరగలేదు. ఇక హైదరాబాద్‌కు దేహం వచ్చాక నాటి ముఖ్యమంత్రి వైఎస్ఆర్ నిర్వహించిన పాత్ర శకునికి కూడా సరిపోదు. దేహాన్ని సరిగా దహనం కూడా చేయించకుండానే చేతులు దులుపుకొన్నారు. దాంతో సోనియాగాంధీ ఊపిరి పీల్చుకున్నది. నాటినుంచి నేటిదాకా ఒక్క కాంగ్రెస్ గల్లీ నాయకుడైనా పీవీ సేవలు స్మరించలేదు.

తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన ముఖ్యమంత్రి కేసీఆర్ మాత్రం పీవీ పట్ల కాంగ్రెస్ అనుసరించిన వైఖరిని తీవ్రంగా ఖండించారు. పార్టీలకు అతీతంగా ఆయన దేశానికి చేసిన మేలును వేనోళ్ల పొగిడారు. పీవీ మన తెలంగాణ బిడ్డవడం మన అదృష్టమన్నారు. ఆయన పేరిట విశ్వవిద్యాలయం ఏర్పాటుచేశారు. కాంగ్రెస్ ధృతరాష్ట్ర బుద్ధిని ఎండగట్టారు. చివరికి 2020-21లో పీవీ శత జయంత్యుత్సవాలను ఏడాది పాటు ఘనంగా నిర్వహించి ఒక 10 శాతం రుణం తీర్చుకున్నానని ఇంకా 90 శాతం ఉందన్నారు. ఎక్కడో మూలన తన కళాసేవను తాను చేస్తూ ఫైన్ ఆర్ట్స్ కాలేజీని చూసుకొనే విద్యావేత్త అయిన పీవీ కూతురు సురభి వాణీదేవిని పిలిచి మరీ ఎమ్మెల్సీగా గెలిపించుకున్నారు. నిజానికి కేసీఆర్‌కు పీవీ శత జయంత్యుత్సవాలు చేస్తే ఒరిగిందేమి లేదు. స్వపక్షీయుడు కాదు. పైగా పీవీ కాంగ్రెస్ పార్టీ నాయకుడు. కానీ, పార్టీలకతీతంగా కేసీఆర్ సమున్నతంగా ఆలోచించారు. దేశం కోసం పాటుపడిన పీవీని సముచితంగా గౌరవించారు. అది ఆయన సంస్కారం. అన్నం పెట్టిన పీవీ సేవలను స్మరించుకున్నారు. అదే కాంగ్రెస్ పార్టీ మాత్రం పీవీ నోట్లో సున్నం కొట్టింది. పీవీకి క్రెడిట్ ఇస్తే సోనియాగాంధీ వ్యక్తిత్వం ఎక్కడ మసకబారుతుందోనని, కాంగ్రెస్ పార్టీ ఎక్కడా ఆయన ప్రస్తావన తీసుకురాకుండా జాగ్రత్తపడుతూ వచ్చింది. ప్రజలు అన్నీ గమనిస్తున్నారు.

1956-83 వరకు ప్రజలు కాంగ్రెస్‌నే గెలిపించారు. చివరికి కాంగ్రెస్ అంటేనే అగ్నిశిఖలా ప్రజ్వరిల్లే ఎన్టీఆర్ సైతం పీవీని నంద్యాల నుంచి గెలిపించడానికి అభ్యర్థిని పోటీకి నిలపకుండా మన తెలుగు బిడ్డ అని మమకారంతో గౌరవించిన సంస్కారి. ఆ



పాటి సంస్కారం, మానవతా విలువలూ లేని కాంగ్రెస్ ఇప్పుడు మళ్లీ ఓట్ల కోసం ప్రజల్లోకి వచ్చింది. కాంగ్రెస్‌కు పట్టంగడితే హెడ్ క్వార్టర్స్ ఢిల్లీకి బదిలీ అవుతాయి. షికాయత్‌లు, సిఫారసుల పర్వంలో మళ్లీ డ్రామా మొదలవుతుంది. 1వ కృష్ణుడు, 2వ కృష్ణుడు అనేవిధంగా ముఖ్యమంత్రుల మార్పులు మొదలవుతాయి.

ఇక ఇంకో అంశం తెలంగాణ రాష్ట్రావతరణ గురించి. ఇప్పుడు కాంగీయులు సోనియమ్మే తెలంగాణ ఇచ్చిందని చెవులు కోసిన మేకల్లా అరుస్తున్నారు. 1969 నుంచి తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం గురించి నాలుగు దశాబ్దాల పాటు పట్టించుకోని కాంగ్రెస్ 2013లో కేవలం కేసీఆర్ అలుపెరుగని పోరాటానికి తలొగ్గింది. కేసీఆర్ వ్యక్తి కాదు వ్యవస్థ అని కళ్లు తెరిచింది. 'తెలంగాణ అచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో' అనంగనే కాంగ్రెస్ కలవరపడింది. అలా కేసీఆర్ వల్లనే తెలంగాణ వచ్చింది. ఈ రాష్ట్ర ప్రజల తలరాతలు మారినయి. ఈ ఆధునిక సమాజంలో సోషల్ మీడియా మార్పులు తెచ్చింది. చెవుల్లో పూలు పెట్టి చెప్తే వినే పరిస్థితిల్లో నేటి తరం యువకుల్లేరు. గాంధీజీ నాయకత్వాన ఎందరో సమరయోధులు ఆసేతు హిమాచలం పోరాడగా ఎందరో త్యాగధనులు తమ ధన, మాన, ప్రాణాలను పణంగా పెడితే వచ్చింది మనకు స్వాతంత్ర్యం. రాగానే కాంగ్రెస్ పార్టీని రద్దుచేయమని గాంధీజీ కోరారు. బాపూజీ ప్రాణాలతోనే ఆయన సూచనలు, ఆశయాలు గాల్లో కలిశాయి. గాంధీతో విభేదించే నెహ్రూ తదుపరి కాంగ్రెస్ ఆకారం మారిపోయింది. చివరికి ఇందిరమ్మ కాంగ్రెస్ అయింది. తర్వాత పైలెట్ రాజీవ్‌గాంధీ వచ్చాక కాంగ్రెస్ మరింత సంకుచితమైంది. బోఫోర్స్ కుంభకోణాల చిక్కుల్లో పడిన రాజీవ్ తర్వాత మళ్లీ పీవీనే కాంగ్రెస్ ఐ లోని ఐ తోకను కత్తిరించారు. ఆ కత్తిరింపులు నచ్చని నాయకురాలు నాగమ్మ కోల్డ్‌వార్ మొదలుపెట్టింది. 'బంటురీతి కొలువీయవమ్మా' అని సాగిలపడి మొక్కేవారిని చేరదీసింది. పీవీ ఉన్నంతకాలం తన ఆటలు సాగవని గ్రహించి వెంటనే వెన్నెముక లేని ప్రాణులను చేరదీసి 'ఉస్కో' అని ఉసిగొలిపింది. మొరిగే గ్రామ సింహాలకు భయపడని పీవీ మాత్రం ప్రధానిగా దేశాన్ని మహోన్నత పథంలో నడిపించారు.

ఈ అంశాన్ని సీపీఐ, సీపీఎం మొదలైన వామపక్షాలు వాజపేయి వంటి కమలదళ నేతలు అంగీకరించినదే. అయితే సోనియా ఆమె గ్యాంగ్ మాత్రం కళ్లకు గంతలు కట్టుకొని పీవీని తెరమరుగు చేయాలని సంకల్పించారు. పీవీ చేసిన అభివృద్ధిని పొరపాటున కూడా బహిరంగ సభల్లోనే కాదు ఏకాంతంలో, ఇంకా చెప్పాల్నంటే కలలో కూడా ప్రస్తావించరాదని హుకుం జారీచేసింది. అంతేకాదు, అయోధ్య మొదలు జార్ఖండ్ ముడుపుల కేసుల వరకు ఎవరూ పీవీకి అండదండగా ఉండరాదని హుకుం జారీచేసింది. కానీ యథో ధర్మః తథో జయః.. ధర్మం ఎక్కడ ఉంటే విజయం అక్కడ ఉంటుంది. అలా పీవీ నిర్దోషిగా బయటపడ్డారు. గాంధీజీని, శాస్త్రీజీని, ఆ తర్వాత పీవీ సాబ్‌ను తమ చరిత్ర పుటల్లోంచి తొలగించిన కాంగ్రెస్ అఖిల భారతీయులకు భారం అయిందన్నది అక్షర సత్యం. లేకుంటే ఒకప్పుడు కాంగ్రెస్‌లో ఉన్నటువంటి శరద్‌పవార్, మమతా బెనర్జీ వంటివారు సొంత పార్టీని పెట్టుకునేవారు కాదు. అయోధ్య వివాదంలో పీవీని దుయ్యబట్టిన అర్జున్ సింగ్ 1982లో మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్నపుడు భోపాల్ గ్యాస్ లీకైన దుర్ఘటనకు స్పందించాల్సింది పోయి ప్రాణభయంతో హెలీకాప్టర్‌లో పారిపోయి కేర్వాన్ డాం ప్యాలెస్‌లో తలదాచుకున్నారు. అయినప్పటికీ కళ్లకు గంతలు కట్టుకొన్న ధృతరాష్ట్ర కాంగ్రెస్ పెద్దలు 'అర్జునుడు' మంచివాడని కితాబ్ ఇచ్చారు. ఇలా చెప్తూ పోతుంటే కాంగీయుల లీలలు అష్టాదశ పురాణాలను మించిపోతాయి. కాబట్టి, రైతు బాంధవుడు, మైనారిటీలు, బ్రాహ్మణ కులంతో సహా అన్ని కులమతాలకు సమ ప్రాధాన్యం ఇచ్చి ఏదో ఒక 'బంధు' పథకంతో నిరుపేదల కన్నీళ్లు తుడిచే కేసీఆరే తెలంగాణను బంగారు తెలంగాణగా మార్చారు. ఇట్లా బంగారుమయంగా మారిన తెలంగాణను మళ్లీ మట్టిముద్దలుగా చేస్తుంది కాంగ్రెస్. బంగారాన్ని కుదువపెట్టి బిచ్చమెత్తుకొనే స్థితికి వచ్చిన భారతదేశాన్ని ప్రగతి పథంలోకి తీసుకెళ్లిన అపర చాణక్యుడు మన తెలంగాణ బిడ్డ పీవీనే కృతజ్ఞత లేకుండా తెర వెనుకకు నెట్టిన కాంగ్రెస్ మన బతుకులను బాగు పరుస్తుందంటే నమ్మవచ్చా?

**కొసమెరుపు:** 'మొగుడు చచ్చినంక భార్య బుద్ధిమంతురాలైనట్టు' పీవీ చనిపోయిన పంతొమ్మిదేండ్ల తర్వాత కాంగ్రెస్‌కు జ్ఞానోదయం అయింది. రాష్ట్రంలో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ లబ్ధి పొందేందుకు తెలంగాణలో ఓ జిల్లాకు పీవీ పేరు పెడుతామని ప్రకటించింది. పీవీ ఫొటోకే దండ వేయడానికి తటపటాయించే కాంగీయులు జిల్లాకే పేరు పెడతారంటే తెలంగాణ ప్రజల చెవుల్లో పూలు పెట్టడమే.. మొండిచేయి చూపడం, అరచేతిలో బెల్లంపెట్టి మోచేతులు నాకించడం కాంగీయులకు వెన్నతో పెట్టిన విద్య. పీవీ పేరిట జిల్లా పెట్టినంత మాత్రాన తెలంగాణకు ఒరిగేదేమీ ఉండదు. అలాంటి ప్రయత్నం ఏదైనా చేస్తే గీస్తే కేసీఆరే చేయగలరు. నేటి కాంగ్రెస్... స్వాతంత్ర్యోద్యమ కాలం నాటి కాంగ్రెస్ కానే కాదు. 'మా తాతలు నేతులు తాగారు, మా మూతుల వాసన చూడండి' అని నేటి కాంగీయులు నాటి కాంగ్రెస్ పేరు చెప్పుకొని పబ్బం గడుపుతున్నారు. తస్మాత్ జాగ్రత్త.

---



## తాత ఓటెయ్యబోతున్నడు

అగ్గో! అందరికన్నా ముందే
తాత ఓటెయ్యబోతున్నడు!
హుశారుగా పొద్దున లేసి
యాప పుల్ల నోట్లేసుకొని
గల్లీల ఇయ్యాల ఓటెయ్యబోవాలె
ఇగ పంటే కుదరదు
లెగండి అంటూ వైతాళికుడిలా తాత!
కాళ్లకు కిర్రు కిర్రు చెప్పులేసుకొని
అరిగేటట్టు తిరుగుతున్నడు!
తాత కంచు కంఠస్వరం ముందు
డప్పుల మోత మెత్తవడ్డట్టే ఉంటది
తాత తానంజేసి
గిన్నెడు అంబలి దాగి
తెల్లటి దోతి, తలకు పట్కా
చేతిలో కట్టె వట్టుకొని ఓటెయ్యబోతున్నడు!
ఒక్కడే కాదు, అవ్వ ఎంబడి రాంగ
పోరని లెక్క
రాజు మాదిరి నడుసుకుంటా
తాత ఓటెయ్యబోతున్నడు!
తాత ఎనకనే ఎందరో
యాది మరువకుండా ఓటెయ్యబోతున్నరు!
ఓట్లు పడే రోజు ఊర్ల పక్కా జాతర లెక్కనే మరి!
తాతకు ఓటేసే తరీఖా మంచిగ తెలుసు
ఊరోళ్లందరికీ అనుభవంతోని ట్రైనింగ్ ఇచ్చిండు
తాత వేలి మీద గతంల ఓటేసినట్టు
ఎన్ని సిరా చుక్కలు వడ్డయో
మనం ఓటెయ్యడం మరువద్దు
ఓటేస్తనే దునియలా ఉన్నట్టు
తాత గులాల్ సల్లుకుంటా
తన వాడకట్టు బలగంతోని గుంపుగ కలిసి
ఆగినోల్లను నడువుమని
తాత ఓటెయ్యబోతున్నడు!
తాత ఎనక మనం గూడ ఓటెయ్యబోవాలె
తాత కన్నా ముందే ఓటెయ్యాలే!!



కందాళై
రాఘవాచార్య
8790593638

---

# పదేండ్ల తెలంగాణ.. రెండు అనుభవాలు



ఆస్కాని మారుతి సాగర్
90107 56666

సరిగ్గా ఇరవై ఏండ్ల కిందినాటి ఆర్థిక సంస్కరణల ప్రభావంతో వచ్చిన రోడ్లు, ఫైవంతెనల గురించి పెద్ద ఎత్తున చర్చ జరిగేది. నల్లతాచు పాముల్లా రోడ్లున్నాయని కవితాత్మకంగా కవులు చెప్పేవారు. దాన్ని తాము సాధించిన అభివృద్ధిగా రాజకీయ నాయకులు గొప్పగా చెప్పేవారు. పదేండ్ల కిందటికి, ఇప్పటికి మన రాష్ట్రంలో వచ్చిన మౌలికమైన మార్పు స్పష్టంగా కనిపిస్తున్నది. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నుంచి వందల కిలోమీటర్ల మేర పడమర, ఉత్తరాలుగా జరిగిన మా ప్రయాణ అనుభవాలు.. తెలంగాణలో మౌలిక మార్పు గురించిన కొన్ని విషయాలను చర్చించడం ఈ వ్యాసం ఉద్దేశం.

రాష్ట్ర రాజధాని నలువైపులా ఎటువైపు వెళ్లినా నాలుక చాచుకొని పడుకున్న అనకొండల్లానే విస్తారమైన రహదారులు కనిపించాయి. ఇంకా కొన్ని రోడ్లయితే మరింత సున్నితంగా ఉన్నాయి. కానీ, వాటిపై పరుచుకున్న ధాన్యపురాసులు మాత్రం బంగారు వన్నెతో ఆ రోడ్లకు ఆభరణంలా కనిపించాయి. రోడ్డుపై ప్రయాణిస్తూ కుడి, ఎడమా రెండువైపులా కనుచూపు మేర పచ్చదనం కన్పిస్తున్నది. ఆకురాలు కాలంలో కూడా ఆ పచ్చదనం, వెచ్చదనం ప్రయాణికులను ముగ్ధులను చేస్తుందనడంలో సందేహం లేదు. ఈ అనుభూతి, అనుభవం వెనుక కొన్ని కారణాలున్నాయి.

మొన్నీ మధ్య హైదరాబాద్ నుంచి తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ, నేను ఇంకొంత మంది కలిసి ఒక జర్నలిస్టు మిత్రుడి ఇంట్లో కార్యానికి జనగామ వెళ్లాం. హైదరాబాద్ నుంచి జనగామ జిల్లా వరకు ఆకులు రాలే కాలంలో మెట్ట చెల్కల మొక్కజొన్న, ఆముదం, కందిచేల స్థానంలో ఎటుచూసినా వరి పంటే కన్పించింది. అంతే కాదు, రోడ్డుపక్కన కొన్ని కిలోమీటర్ల మేర నీటి మడుగులు కన్పించాయి.

మనోవేగంతో పోటీపడే కారు వేగాన్ని సైతం కాస్తా నిదానించి వెళ్లమనేలా చెరువుల్లో నీటి అలల మిల మిలలు కన్పించాయి. అందరం గమనిస్తున్నాం. మా ప్రయాణం మధ్యలో చర్చ ప్రారంభమైంది. ఏమిటీ మార్పు? పదేండ్ల కింద ఇట్లా లేదు కదా? ఎన్ని విధ్వంసాలను దాటుకొని తెలంగాణ వచ్చింది. స్వయం పాలన తీసుకువచ్చిన మార్పును మనం కాస్త లోతుల్లోకి వెళ్లి తొంగిచూస్తే మరిన్ని విషయాలు అర్థమవుతాయి. హైదరాబాద్ నుంచి ఉప్పల్ దాటి ఘట్కేసర్ రాగానే అక్కడక్కడా కొన్ని చేన్లు కన్పించేవి. ఆ తర్వాత బీబీనగర్ చెరువు, కొన్ని వరి పొలాలు. ఆలేరు చుట్టుపక్కల అంతా డ్రై. కొన్ని ఏరియాల్లో మాత్రం విసిరేసినట్టు కొన్ని వరి చేలు. ఇది పదేండ్ల కింద వరంగల్ రోడ్డు ప్రయాణంలో తాము చూసిన అనుభవాలని మిత్రులు చెప్పారు. మిషన్ కాకతీయ ద్వారా చెరువులు నింపడం, కాళేశ్వరం నీళ్ల ద్వారా వాగులు, వంకల్లో గోదావరి జలాలు. భూమిలో పెరిగిన నీటిమట్టం. వెరసి హైదరాబాద్ నుంచి జనగామ వెళ్తున్నంత దూరం మేము చూసినంత వరకు భూమికి పచ్చదనం అద్దినట్టే ఉన్నది. ఆలేరు దాటి గ్రామీణ ప్రాంతాల్లోకి వెళ్తున్నప్పుడు రోడ్డు కన్పించకుండా వరిధాన్యం పుట్లకొద్దీ కన్పించింది. కొలనుపాక నుంచి ఒక మారుమూల గ్రామానికి మా ప్రయాణం సాగినంత దూరం ధాన్యపు సిరులు మా కారు వెంట అదే రోడ్డుపై ప్రయాణం చేసినట్టు కనిపించాయి. మధ్యలో కారు ఆపి రైతులతో ముచ్చటిస్తే.. పూర్వం కొన్ని గ్రామాల్లో జొన్నలు మార్పిళ్లు చేసేవారమని, ఇప్పుడు విరివిగా నీళ్లు రావడంతో రెండు పంటలూ వరి సాగు చేస్తున్నామని చెప్పారు. తమ జీవనసరళిలో మార్పు వచ్చిందని కూడా అన్నారు. ఉమ్మడి వరంగల్‌లో నల్లరేగడి నేల ఎక్కువగా ఉండటం, నీటి సౌకర్యం రావడంతో వరి, చెరుకు, పత్తి, మిర్చి వంటి పంటలు సాగవుతున్నాయి. 1996-99 మధ్య పత్తి రైతులు ఆత్మహత్యలు అత్యధికంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో జరిగాయి. వ్యవసాయం పూర్తిగా సంక్షోభంలో చిక్కుకున్నది. ఇప్పుడు ఆ చిత్రం పూర్తిగా మారిపోయింది. నాటి ప్రభుత్వాలు రైతు వ్యతిరేక విధానాల కారణంగా వ్యవసాయ విధ్వంసం జరిగింది. కరెంటు లేక, నీరు లేక పంటలు ఎండిన విషయాలు, నాటి పత్రికల్లో రిపోర్టు అయిన విషయాలు ఇట్లా చాలా మాట్లాడుకున్నాం. ప్రధానంగా అల్లం నారాయణ సార్ ఉత్తర తెలంగాణలో నాటి పరిస్థితుల గురించి, తన జర్నలిజం అనుభవాలు, రైతుల సమస్యల గురించి చాలా విషయాలు చెప్పారు. నేను కూడా ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాలోని రైతుల గురించిన విషయాలు నాటి విధ్వంసం గురించి చెప్పాను. మొత్తం ఈ ప్రయాణంలో మాకు గతానికి, ఇప్పటికి వచ్చిన తేడాతో రైతుల ముఖాల్లో ఆనందాన్ని గమనించాం.



ఇదిలా ఉంటే మరో రెండురోజుల తర్వాత... ఎన్నికల్లో ప్రజల నాడి తెలుసుకునేందుకు నాతో పాటు గోరటి వెంకన్న, జర్నలిస్ట్ యూనియన్ నాయకులు యోగానంద్, ఇంకా కొందరు మిత్రులం కల్సి ఉమ్మడి మెదక్ జిల్లాలో కొన్ని గ్రామాల్లో ఉదయం నుంచి రాత్రి వరకు తిరిగాం. పదేండ్ల కాలంలో తెలంగాణలో వచ్చిన మార్పు ఏమిటీ? ప్రజలు ఏం ఆలోచిస్తున్నారు? ప్రభుత్వ పథకాలు వారి జీవితాల్లో మార్పులు తీసుకొచ్చాయా? రైతుబంధు, మిషన్ కాకతీయ పథకాల గురించి ఏమనుకుంటున్నారు? ఇట్లా చాలా విషయాలు తెలుసుకునే ప్రయత్నం చేశాం. మేం అందోల్ చెరువులో నీళ్లు.. చెరువు కింద వరి సాగు అక్కడినుంచి మా ప్రశ్నల ప్రయాణం ప్రారంభమైంది. చెరువు కింద మునుపెన్నడూ లేనివిధంగా రెండు పంటలు తప్పకుండా సాగు చేసుకుంటున్నామని రైతులు చెప్పారు. ఓవైపు బీఆర్ఎస్ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ నామినేషన్ ర్యాలీ జరుగుతున్నది. కిక్కిరిసిన జనసందోహం. మా కారును అతికష్టం మీద వారిని దాటుకొని మంజీరా రిజర్వాయర్ వరకు వెళ్లసాగాం. ఎటుచూసినా పెద్ద పెద్ద రోడ్లు. రోడ్లపై ధాన్యపురాశులు. యాభై కిలోమీటర్ల మేరకు మాకు వరిధాన్యపు రాశులు రోడ్లపై కన్పించాయి. గ్రామానికి ఐదారు కిలోమీటర్ల దూరం నుంచి మరో గ్రామం దాటి ఐదారు కిలోమీటర్లు వెళ్లేంతవరకు ధాన్యమే కన్పించింది. ఒక దగ్గర కారును ఆపి రోడ్డుపై ఉన్న ఆ ధాన్యాన్ని చేతుల్లోకి తీసుకున్న గోరటి వెంకన్న ఒకింత భావోద్వేగానికి లోనయ్యారు. పల్లెపల్లెనా పల్లేర్లు మొలిచే అని నాడు తను రాసిన పాటను గుర్తుచేసుకొని నేడు కళ్లెదుట కనిపిస్తున్న ధాన్యపు సిరులను, పచ్చటి పైరులను చూసి పులకించిపోయారు. అక్కడే ఉన్న రైతులు కొందరు తమకు రైతుబంధు వల్ల పెట్టుబడి సాయం సకాలంలో అందుతున్నదని, దానికితోడు కరెంటు, నీళ్ల సమస్య లేదని పంట దిగుబడి బాగా ఉన్నదని చెప్పారు. మునిపల్లె, పుల్కల్ మండలాల్లోని చాలా గ్రామాలు తిరిగాం. ప్రతీ గ్రామంలో రోడ్డుకిరువైపులా విస్తారంగా చెరుకు సాగు కన్పించింది. కూరగాయల తోటలున్నాయి. కోసేందుకు సిద్ధంగా ఉన్న వరిచేన్లు కన్పించాయి. అంతేకాదు, దాదాపు ప్రతీ గ్రామంలోని తటాకాలు నీటి అలలతో అలరారుతున్న దృశ్యాలే దర్శనమిచ్చాయి. ప్రతి చెరువు దగ్గర చిన్నపాటి చేపల మార్కెట్‌లా ఉన్నది. చేపలు పట్టేవారితో కూడా కొందరితో మాటలు కలిపాం. వారి అనుభవాలు తెలుసుకున్నాం. రచ్చబండలపై కూర్చున్న వృద్ధులు మేము ప్రశ్న వేయకముందే, 'ముసలివాళ్ల గురించి ఆలోచించింది, ఆదరిస్తున్నది ఒకే ఒక పార్టీ, ఒకే ఒక్క నాయకుడు. ఆయనే తెలంగాణలో ఉన్నడు. ఆయనను ఆదరించాలని' తమ ఓటు ఎవరికో కొందరు పరోక్షంగా, మరి కొంత మంది సూటిగా కారు గుర్తుకు అని చెప్పారు.

ప్రజల నాడి తెలుసుకునే క్రమంలో వాళ్లను ప్రశ్నించే సమయంలో గోరటి వెంకన్నతో కొందరు సెల్ఫీలు దిగారు. పదేండ్ల కింద మెదక్ జిల్లా సొంతం వలస పైనే ఆధారపడేది. హైదరాబాద్ దగ్గరగా ఉండటంతో కంపెనీల్లో చిన్నాచితక పనులు చేసుకొని పొట్ట పోసుకునేవారు. ఇప్పుడు మంజీరా నదిలో నిరంతరం నీరు పారుతుందేమో... నదితో పాటు పంటల సాగూ ఉన్నది. వలస వెళ్లినవారు వాపస్ రావడంతో ఈ నది పరీవాహక ప్రాంతం అంతా జన ప్రవాహం మళ్లీ తిరిగివచ్చింది. సాగులో మునిగితేలుతోంది. సరికొత్త జీవనాన్ని ప్రారంభించింది.

వాస్తవానికి ఈ రెండు అనుభవాలు ఉత్తర, దక్షిణ తెలంగాణ జిల్లాలకు సంబంధించినవి. రెండు ప్రాంతాలిప్పుడు జలకళను సంతరించుకొని ధాన్యపు రాసులతో కళకళలాడుతున్నాయి. ఈ రెండు ప్రాంతాల్లో వాతావరణ, జీవావరణ సమ్మిళిత అభివృద్ధి మానవీయ కోణంలో జరుగుతున్న తీరు కళ్లకు కట్టినట్టు కన్పించింది. బహుశా పదేండ్లలో వచ్చిన మార్పు ఇది. స్వయం పాలన సాధించిన విజయంగానే దీన్ని చూడాలి.

(వ్యాసకర్త: సీనియర్ జర్నలిస్ట్)

---

# ఎటమటం




## అప్పడేమైంది కిషన్‌జీ?

కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చిదంబరం వ్యాఖ్యలపై బీజేపీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి స్పందన గురివింద సామెతను గుర్తుకుతెస్తున్నదని అంటున్నారు. ఇంత కాలానికైనా తెలంగాణ సమాజానికి కాంగ్రెస్ క్షమాపణ చెప్పింది. మరి మీ (బీజేపీ) సంగతేమిటని సామాజిక మాధ్యమాల్లో కిషన్‌రెడ్డిని నెటిజన్లు నిలదీస్తున్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని కాంగ్రెస్ ఇవ్వలేదు, 12 వందల మంది బలిదానాలతో ఏర్పడిందని కిషన్‌రెడ్డి గుర్తుచేసిన సంగతి తెలిసిందే. ఇంత వరకు బాగానే ఉంది, కానీ మరి పార్లమెంట్ సాక్షిగా తెలంగాణ ఉద్యమాన్ని అవహేళన చేసేలా 'తల్లిని చంపి బిడ్డను బతికించారు' అని ప్రధాని నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యల సంగతేమిటని నెటిజన్లు కిషన్‌రెడ్డిని ఉతికిపారేస్తున్నారు. చిదంబరం చేసిన వ్యాఖ్యలకు స్పందించిన మీరు, మరి మోదీ వ్యాఖ్యలకు ఎందుకు స్పందించకుండా నోరు మూసుకున్నారని సూటిగా ప్రశ్నించారు. మనం చేస్తే ఒప్పు, పక్కోడు చేస్తే తప్పా అని కిషన్‌రెడ్డికి చుక్కలు చూపిస్తున్నారు.



## ఇదంటే, అదిస్తరనీ...

కాంగ్రెస్ గెలిస్తే సోనియాగాంధీ తనకే సీఎం పోస్టు ఇస్తుందని కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తాజాగా మరోసారి తాను సీఎం రేస్‌లో ఉన్నట్టు గుర్తుచేశారు. మీకు సోనియమ్మ ఇస్తే తమకు ఇచ్చే గాడ్‌ఫాదర్లు కూడా అధిష్ఠానంలో ఉన్నారని ఇతర నేతలు గుర్తుచేస్తున్నారు. రేవంత్‌రెడ్డికేమో డీకే శివకుమార్, భట్టి విక్రమార్కకేమో మల్లికార్జున్ ఖర్గే, సీతక్కకేమో రాహుల్‌గాంధీ, మధుయాష్కీకేమో కేసీ వేణుగోపాల్, జగ్గారెడ్డికేమో బోసు రాజు సీఎం పోస్టు ఇప్పిస్తారని వారు కలలు గంటున్నారు. ఏమిటీ? ఇంతమందికి సీఎం పోస్టు ఇవ్వడం సాధ్యమేనా? అనే సంశయం అక్కర్లేదు. వీరందరు సీఎం పోస్టుకు పోటీ పడటానికి ఓ కారణముంది. సీఎం పోస్టు అడిగితే కనీసం మంత్రి పోస్టు అయినా గ్యారెంటీగా తగలుతుందని వీరి ముందుచూపు. మొదట సీఎం రేసులో ఉన్నట్టు ప్రచారం జరిగితే ఆ సీటులో కూర్చునే ఆయనే తనకు అడ్డురాకుండా మంత్రి పదవి ఇప్పిస్తారన్నది వ్యూహమట. మన కాంగ్రెస్ నేతలు మహా ముదుర్లని ఊరికే అన్లేదోయ్.




## అన్ని ఎమ్మెల్సీ సీట్లా?

కాంగ్రెస్ టికెట్ ఆశించి భంగపడిన నేతలు నియోజకవర్గానికి ఇద్దరు, ముగ్గురున్నారు. టికెట్లు ప్రకటించగానే అసమ్మతి భగ్గుమంది. తాడో పేడో తేల్చుకుంటామని వారంతా నామినేషన్లు వేశారు. అయితే నయానో, భయానో, బతిమాలో, బామాలో కొందరితో ఉపసంహరింపజేశారు. ఇంకా పలు నియోజకవర్గాల్లో తిరుగుబాటు అభ్యర్థులు బరిలో కొనసాగుతున్నారు. వారికి నచ్చజెప్పడానికి ప్రత్యేకంగా బుజ్జగింపుల కమిటీని వేసింది. ఈ కమిటీ ఎంపీ, ఎమ్మెల్సీ పోస్టులు ఇస్తామంటూ బిస్కెట్ వేస్తున్నది. వాటికి కూడా లొంగనివారికి ఎమ్మెల్సీతో పాటు మంత్రి పదవి ఆఫర్ చేస్తున్నది. ఇప్పటికే 30 మందికి ఎంపీ టికెట్, 75 మందికి ఎమ్మెల్సీ పదవులు ఇస్తామని హామీ ఇచ్చినట్టు సమాచారం. ఎంపీ సీట్లున్నవే 17 అందులో ఒకటి ఎంఐఎంకు మినహాయిస్తే 16 సీట్లే. అలాగే ఎమ్మెల్సీ మొత్తం సీట్ల సంఖ్య 40, ప్రస్తుత సభ్యుల పదవీకాలం ముగియడానికి దశలవారీగా కనీసం రెండు, మూడేండ్లు పడుతుంది. మరి అలాంటప్పుడు ఇంతమందికి ఎమ్మెల్సీలు ఎలా ఇస్తారు? కర్ణాటక తరహా గ్యారెంటీలు ఇక్కడ అమలుచేస్తామంటున్నారు, బహుశా అక్కడున్న 75 ఎమ్మెల్సీ సీట్లను కూడా తెలంగాణకే ఇస్తుందేమోనని రెబల్ అభ్యర్థి ఒకరు ఎద్దేవా చేశారు.

**- వెల్జాల**